తెలుగు దినపత్రిక
ప్రభాత jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 236
పేజీలు : 5
వెల : 4
మల్కాజిగిరి
గురువారం, 11-04-2024

జయభేరి దినపత్రిక
జయభేరి చానల్లో
నికార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా..
ఆసక్తి కలిగిన యువతీ
యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత
jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889
JB జయభేరి

# రంజాన్.. సిటీలో ట్రాఫిక్ ఆంక్షలు




జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 10:

రంజాన్ సందర్భంగా హైదరాబాద్ పలు ఏరియాల్లో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతున్నాయి. మీర్ ఆలం ఈద్గా, మాసబ్ ట్యాంక్ లోని హాకీ గ్రౌండ్స్ లో ఈదుల్ ఫితర్ ప్రార్థనలకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. రేపు ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు వర్తిస్తాయి. మీర్ ఆలం ఈద్గా వద్ద పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రార్థనలు చేయనున్నందున ఈద్గా, తద్బన్ వైపు వాహనాల రాకపోకలను అనుమతించరు. బదులుగా దీనిని బహదూర్ పురా చౌరస్తా వద్ద కిషన్ బాగ్, కామాటిపురా,

...మిగతాది 2 లో

# ముస్లీం సోదరులకు సీఎం రంజాన్ శుభాకాంక్షలు



జయభేరి, హైదరాబాద్ :

ముస్లిం సోదరులందరికీ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈద్ ఉల్ ఫితర్ వేడుకలను రాష్ట్రంలోని ముస్లింలందరూ ఆనందంగా జరుపుకొని అల్లా దీవెనలను అందుకోవాలని ఆకాంక్షించారు. నెల రోజుల కఠిన ఉపవాస దీక్షల అనంతరం జరుపుకునే రంజాన్ పండుగను ముస్లింలు తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులందరితో ఇంటిల్లిపాది సంతోషంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిన రంజాన్ మాసంలో ముస్లింలు అనుసరించే కఠోర ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్థనలు, జకాత్, ఫిత్రా పేరుతో పేదలకు చేసే దాన ధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు.

# రాముడిని మొక్కుదాం.. బీజేపీని తొక్కుదాం..

- 420 హామిలిచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనిక్కింది
- ఫోన్ ట్యాపింగ్ మీద పెట్టిన శ్రద్ధ మంచినీళ్ల మీద పెట్టు
- నీ ప్రభుత్వాన్ని పడగొట్టాల్సిన ఖర్మ మాకు లేదు.. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- హుజురాబాద్ లో చెల్లని రూపాయి మల్కాజిగిరిలో ఎలా చెల్లుతుంది.. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి


3లో

జయభేరి, మేడిపల్లి :

మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎంకెబీఆర్ కన్వెన్షన్ నందు జరిగిన ఉమ్మడి ఘట్కేసర్ మండల బిఆర్ఎస్. సన్నాహక సమావేశంలో ముఖ్య అతిధిగా మాజీ మంత్రి, బిఆర్ఎస్. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, మేయర్లు జక్క వెంకట్ రెడ్డి, సామల బుచ్చిరెడ్డి, బోడుప్పల్ బి.ఆర్.ఎస్. అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, పీర్జాదిగుడా, బోడుప్పల్, పోచారం, ఘట్కేసర్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓటింగ్ శాతం పెరిగేలా ప్రత్యేక దృష్టి



- వంద శాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా చైతన్య కార్యక్రమాలు
- స్వీప్ కార్యక్రమాల విస్తృత నిర్వహణకు కార్యాచరణ
- జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్

జయభేరి, హైదరాబాద్

జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలలో పోలింగ్ శాతం పెంచడం పై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ పేర్కొన్నారు.వందశాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. బుధవారం బుద్ధ భవన్ లోని సమావేశ మందిరంలో ఏ.ఆర్.ఓ లు, ఎన్నికలు విభాగం అధికారులు, స్వీప్ నోడల్ అధికారులతో ఓటింగ్ శాతం పెరుగుదల, స్వీప్ కార్యక్రమాల కార్యాచరణ పై సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో . 50 శాతం కన్నా తక్కువ పోలింగ్ జరిగిన పోలింగ్ బూత్ ల పై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రానున్న 25 రోజుల పాటు స్వీప్ కార్యక్రమాలు విస్తృతం చేయాలని,

...మిగతాది 2 లో

# భాగ్యనగరానికి డేంజర్ బెల్స్



జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 10:

వేసవి వచ్చేసింది. మార్చిలోనే మాడు పగిలేలా ఎండలు దంచికొట్టాయి. ఏప్రిల్లో పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సీయస్కు పైగా నమోదవుతున్నాయి. ఇంకా మే నెల మిగిలే ఉంది. రోహిణి కార్తెలో రోకళ్లు పగిలేలా ఎండలు కొట్టడం ఖాయం. మరోవైపు వాతావరణ శాఖ ఇప్పటికే ఎల్లో, ఆరెంజ్ అలర్ట్ జారీ చేస్తోంది. ఈ క్రమంలో రానున్న రోజుల్లో ఎలా ఉంటుందో అన్న ఆందోళన ప్రజల్లో

...మిగతాది 2 లో

# ఈటెలపై కౌశిక్ ఫైర్



జయభేరి, కరీంనగర్, ఏప్రిల్ 10:

హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పై తీవ్ర ఆరోపణలు చేశారు. హుజురాబాద్ లో గత అసెంబ్లీ ఎన్నికల్లో చెల్లని రూపాయి మల్కాజ్ గిరిలో సార్వత్రిక ఎన్నికల్లో ఎట్లా చెల్లుతదని కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. హుజూరాబాద్, గజ్వేల్ ప్రజలనే కాకుండా అన్నం పెట్టిన కేసీఆర్ ను కూడా ఈటల రాజేందర్ మోసం చేసిండని కౌశిక్ రెడ్డి విమర్శించారు. ఇప్పుడు మల్కాజ్ గిరి ప్రజలను మోసం చేసేందుకు ఈటల ఇక్కడ పోటీ చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ మల్కాజ్ గిరి పార్లమెంటు నియోజకవర్గ సమావేశంలో కౌశిక్ రెడ్డి పాల్గొని మాట్లాడారు.తన అక్రమ ఆస్తులను కాపాడుకునేందుకే ఈటల ఇక్కడ పోటీ చేసేందుకు వచ్చాడు. దేవుడి బొట్టు కూడా పెట్టుకోని ఈటల రాజేందర్ దేవుడి గురించి మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. రాగిడి లక్ష్మారెడ్డి పక్కా లోకల్. చదువుకున్న ఆయనను గెలిపిస్తే ప్రజల సమస్యలను పార్లమెంట్ లో వినిపిస్తడు. బీఆర్ఎస్ కు కేసీఆర్, కేటీఆర్ ఉన్నారు. రేవంత్ రెడ్డి మన వెంట్రుక కూడా పీకలేడు. మల్కాజ్ గిరి ఎంపీగా ఐదేళ్లలో రేవంత్ రెడ్డి ఒక్కసారైనా ముఖం చూపించిండా. బీజేపీతో కుమ్మక్కై డమ్మీ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డిని మల్కాజ్ గిరిలో నిలబెట్టిండు. హుజురాబాద్ లో ఈటల దగ్గర రూ.25 కోట్లు తీసుకొని రేవంత్ రెడ్డి ఆయనకు సహకరించిండు.పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఊహించని పరిణామాలు జరగబోతున్నాయి. పదేళ్లలో కేసీఆర్ చేసినంత అభివృద్ధిని ఎవరైనా చేశారా? ఈటల రాజేందర్ అనే వ్యక్తి మోసగాడు. హుజురాబాద్ లో ప్రజలు బుల్లెట్ దింపినట్లే.. మల్కాజ్ గిరి ప్రజలు కూడా ఆయనకు బుల్లెట్ దింపాలే'' అని కౌశిక్ రెడ్డి మాట్లాడారు.2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఈటల రాజేందర్, కౌశిక్ రెడ్డి ప్రత్యర్థులుగా ఉన్న సంగతి తెలిసిందే. ఆ ఎన్నికల్లో కౌశిక్ రెడ్డి ఈటల రాజేందర్ పైన గెలుపొందారు. దాదాపు 17 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. అంతకుముందు 2021లో జరిగిన హుజురాబాద్ ఉప ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ పై బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ భారీ ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. గత ఎన్నికల్లో హుజూరాబాద్ లో ఈటల ఓటమితో ప్రస్తుతం మల్కాజ్ గిరి నుంచి పోటీ చేయడానికి బీజేపీ అధిష్ఠానం అవకాశం కల్పించింది.



# భువనగిరిపై రేవంత్ సమీక్ష

జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 10:

సీఎం రేవంత్ రెడ్డి ఎంపీ రాజగోపాల్ రెడ్డి నివాసానికి వెళ్లారు. భువనగిరి పార్లమెంట్ ముఖ్య నేతలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లోక్ సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు. సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకునేందుకు ప్రతి ఒక్కరూ కింది స్థాయి నుంచి పనిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. భువనగిరి పార్లమెంట్ సిగ్మెంట్ ముఖ్య నేతలతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్ణయాలపై దిశా నిర్దేశం చేశారు. భువనగిరి టికెట్ ఆశించి అసంతృప్తితో ఉన్న నేతలు సమన్వయంతో ముందుకు పోవాలని సీఎం వారికి సూచించారు. ఈ నెల 21న భువనగిరిలో చామల కిరణ్ కుమార్ రెడ్డి నామినేషన్ వేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పార్టీ ముఖ్య నేతలకు వెల్లడించారు. భువనగిరిలో నామినేషన్ వేసిన తొలిరోజునే సీఎం భారీ బహిరంగ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది.17 నియోజకవర్గాల్లో నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా హాజరుకానున్నట్లు కాంగ్రెస్ పార్టీ తెలియజేసింది. మే మొదటి వారంలో భువనగిరిలో పార్లమెంట్ నియోజకవర్గంలో నిర్వహించబోయే భారీ బహిరంగ సభకు ప్రియాంక గాంధీ హాజరుకానున్నట్లు కాంగ్రెస్ అధిష్ఠానం వెల్లడించింది. భువనగిరిలో చామల కిరణ్ కుమార్ రెడ్డికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా చామల కిరణ్ కుమార్ రెడ్డి పోటీ చేస్తుండగా.. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా క్యామ మల్లేష్ ఎన్నికల బరిలో నిలబడనున్నారు. గత ఎన్నికల్లోనూ భువనగిరిలో కాంగ్రెస్ పార్టీ గెలిచింది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎన్నికయ్యారు. ఎమ్మెల్యేగా గెలవడంతో ఎంపీగా రాజీనామా చేశారు. ప్రస్తుతం భువనగిరికి సిట్టింగ్ ఎంపీ గా ఎవరూ లేరు.గతంలో రాజగోపాల్ రెడ్డి.. రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేసేవారు. ఆయననే కారణంగా చూపి బీజేపీలో చేరారు. తర్వాత మళ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచే అవకాశం ఉందని.. మళ్లీ కాంగ్రెస్ లో చేరారు. తనపై ఎన్ని విమర్శలు చేసినా.. రేవంత్ రెడ్డి.. ఎప్పుడూ పట్టించుకోలేదు. ఇప్పుడు భువనగరిలో గెలుపు బాధ్యతల్ని తీసుకునేందుకు కోమటిరెడ్డి కూడా రెడీ అయ్యారు.

# మోడీపై ట్రాన్స్ జండర్ మండలేశ్వర్ పోటీ



జయభేరి, లక్నో, ఏప్రిల్ 10:

లోక్సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. తొలి విడత ఎన్నికలు మరో వారం రోజుల్లో జరుగబోతున్నాయి. ఈ ఎన్నికల్లో అందరి దృష్టి ప్రధాని మోదీ పోటీ చేస్తున్న వారణాసి, రాహుల్గాంధీ పోటీ చేస్తున్న వాయినాడ్పై ఉంది. మోదీ పోటీ చేస్తున్న వారణాని నుంచే ఓ ట్రాన్స్ జెండర్ బరిలో దిగారు. దీంతో ఈ నియోజకవర్గానికి ప్రాధాన్యం ఏర్పడింది. ఆల్ ఇండియా భారత హిందూ మహాసభ అభ్యర్థిగా కిన్నార్ మహా మండలేశ్వర్ హిమంగి సఖీ బరిలో ఉన్నారు. ఈ విషయాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు స్వామి చక్రపాణి వెల్లడించారు.మండలేశ్వర్ హేమంగి సఖీ సొంత రాష్ట్రం కూడా గుజరాతే. బరోడాలో జన్మించిన మహా మండలేశ్వర్ హిమంగి గురించి ఆసక్తికర విషయాలు బయటకు వస్తున్నాయి. హిమంగీ తండ్రి డిస్ట్రిబ్యూటర్ కావడంతో బరోడా నుంచి ముంబైకి మకాం మార్చారు. హిమంగీ పలు టీవీషోలలో చేశారు. ప్రపంచంలో భగవద్గీతను బోధిస్తోన్న తొలి ట్రాన్స్ జెండర్ హింగీ సఖీ కావడం విశేషం. ఇక 2019 ఫిబ్రవరిలో ఆచార్య మహా

...మిగతాది 2 లో

ప్రభాత జయభేరి

▸▸ మొదటిపేజీ తరువాయి

## సిటీలో ట్రాఫిక్ ఆంక్షలు

పురానాపూల్ వైపు మళ్లిస్తారు. ఇక ఈద్గా వైపు వెళ్లే వాహనాలను శాస్త్రిపురం, ఎన్ఎస్ కుంట తదితర ప్రాంతాల వైపు మళ్లిస్తారు. కాలాపత్తర్ వద్ద మోచి కాలనీ, బహదూర్ పురా, షంషీర్ గంజ్, నవాబ్ సాహెబ్ కుంట వైపు మళ్లిస్తారు.ఇక పురానాపూల్ నుంచి బహదూర్ పురా వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర భారీ వాహనాలను జియాగూడ వైపు మళ్లిస్తారు. శంషాబాద్, రాజేంద్రనగర్ నుంచి బహదూర్పురా వైపు వెళ్లే భారీ వాహనాలను ఆరాంఘర్ జంక్షన్ వద్ద శంషాబాద్ లేదా రాజేంద్రనగర్ లేదా మైలార్ దేవపల్లి వైపు మళ్లిస్తారు. ఇక హైదరాబాద్ లోని మాసబ్ ట్యాంక్ జంక్షన్ ఫ్లైఓవర్ కింద రంజాన్ ప్రార్థనలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఫ్లైఓవర్ కింద వాహనాల రాకపోకలను అనుమతించరు.ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు మెహిదీపట్నం, లక్డీకాపూల్ వైపు నుంచి ఫ్లైఓవర్ పై మాత్రమే రాకపోకలు సాగించవచ్చు. బంజారాహిల్స్ రోడ్ నెం.12 నుంచి మాసబ్ ట్యాంక్ వైపు వచ్చే వాహనాలను రోడ్ నంబర్ 1, 12 జంక్షన్ నుంచి తాజ్ కృష్ణ హోటల్, ఆర్టీఏ ఖైరతాబాద్ వైపు మళ్లిస్తారు. అదేవిధంగా పంజాగుట్ట నుంచి తాజ్ కృష్ణ హోటల్ నుంచి ఎర్రం మంజిల్ కాలనీ, ఆర్టీఏ ఖైరతాబాద్, నిరంకరి, లక్డీకాపూల్, మాసబ్ ట్యాంక్ ఫ్లైఓవర్, మెహిదీపట్నం వైపు వాహనాలను మళ్లిస్తారు. రేపు హైదరాబాద్ తో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఈద్ ఉల్ ఫితర్ వేడుకలు ప్రారంభమవుతాయి. అయితే ఈద్ పండుగను కేరళతో పాటు లేహ్, కార్గిల్ లలో బుధవారం జరుపుకోనున్నారు.

## ఓటింగ్ శాతం పెరిగేలా ప్రత్యేక దృష్టి

అందుకు అవసరమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, రోజువారీ గా వివిధ వర్గాల ప్రజలతో పలు రకాల కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. బి.ఎల్.ఓ లు, బిఎల్ఓ సూపర్వైజర్లు, సెక్టోరల్ అధికారులు ఇంటింటికి తిరిగి, ప్రతి ఓటరును ఓటు వేసేలా చైతన్య పరచాలన్నారు. అందుకు అవసరమైన మైక్రో ప్లానింగ్ చేయాలని సూచించారు. మే,13న పోలింగ్ ప్రక్రియలో పాల్గొని ఓటు వేసేలా చైతన్యం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ హెచ్ జి ల సహకారం తో ఇంటింటికి తిరిగి ఓటర్ కార్డు చూసి, ఓటు ఎక్కడ ఉంది, ఓటరు జాబితాలో పేరు ఉన్నది లేనిది చెక్ చేయాలన్నారు.పూర్తి స్థాయిలో ఏ ఆర్ ఓ లు పర్యవేక్షించాలని సూచించారు. అన్ని కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ లు, షాపింగ్ మాల్స్, టూరిజం ప్లేసెస్, రిలీజియన్ ప్లేసెస్, బస్సు షెల్టర్లలో, ప్రధాన కూడళ్లలో, ఎగ్జిబిషన్ ఉన్న అన్నిస్థలాల్లో, అన్ని మార్కెట్ యార్డులలో, పబ్లిక్ పార్క్ లు, బస్ స్టాండ్ లలో, రెస్టారెంట్ లలో ఓటరు జాబితాలో పేరు చెక్ చేసుకోవాలని, పోలింగ్ తేదీ మే,13 న ఓటు వేయాలని వాల్ పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కళాశాలలలో మీ ఓటు ఉందా ఓటరు జాబితాలో చెక్ చేసుకోవాలన్న పోస్టర్లను డిస్ప్లే చేయాలని, స్వచ్ఛ ఆటో లకు, ట్రాఫిక్ సిగ్నల్స్, ట్రాఫిక్ అంబరిల్లా లో మే, 13న పోలింగ్ లో పాల్గొని ఓటు వేయాలని ఆడియో రికార్డింగ్ చేసి అనౌన్స్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు ఓటు ప్రాధాన్యత, ఓటు హక్కు వినియోగించుకోవడంపై వివిధ పోటీలు, మహిళలకు రంగోలి పోటీలు నిర్వహించాలని సూచించారు. ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా రేడియో జాకీస్, ఫోన్ రింగ్ టోన్, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎన్జీవోస్ తో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఓటరు సమాచార స్లిప్పులను ఓటర్లకు తప్పనిసరిగా అందించి ,ఓటు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. అన్ని రకాల చర్యలతో ఓటర్లను చైతన్యపరిచి ఓటింగ్ శాతం పెంచే దిశగా సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో హైదరాబాద్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్, సికింద్రాబాద్ ఆర్వో హేమంత్ కేశవ్ పాటిల్, ఎన్నికల అదనపు కమిషనర్ అలివేలు మంగతాయారు, అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి, జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడే, స్వీప్ నోడల్ అధికారి అరుణ కుమారి, సికింద్రాబాద్ అసెంబ్లీ కంటోన్మెంట్ ఏ.ఈ.ఆర్ వో ఆకాష్, ఏఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

## మోడీపై ట్రాన్స్ జండర్..

మండలేశ్వర్గా పట్టాభిషేకం జరిగింది. అఖిల భారతీయ సాధు సమాజ్ భాగవత భూషణ్ మహా మండలేశ్వర్ బిరుదుతో సత్కరించింది.ఇక హేమంగి సఖీ శ్రీకృష్ణుని భక్తురాలు. భగవత్ కథలు, దేవి భగవత్ కథలు కూడా రాశారు. లోక్సభ ఎన్నికల్లో మోదీకి హేమంగి సఖీ నుంచి గట్టి పోటీ ఉంటుందన్న చర్చ జరుగుతోంది. అఖిల భారతీయ హిందూ మహాసభ మద్దతుతో మోదీకి గట్టి పోటీ ఇవ్వడం ఖాయమని విశ్లేషకులు కూడా భావిస్తున్నారు. ఇక వారణాసి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా అజయ్రాయ్ పోటీ చేస్తున్నారు. మోదీని ఎదుర్కొనేందుకు ఆయన బలం సరిపోదని పేర్కొంటున్నారు.

## భాగ్యనగరానికి డేంజర్ బెల్స్

కనిపిస్తోంది. ఈ క్రమంలో భాగ్యనగరానికి బిగ్ అలర్ట్ తెరపైకి వచ్చింది.హైదరాబాద్కు తాగునీటి కష్టాలు తప్పేలా లేవు అన్న అంశం తాజాగా తెరపైకి వచ్చింది. ఇప్పటికే బెంగళూరు నీటి ఎద్దడితో అల్లాడుతోంది. ఈ నేపథ్యంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఇటీవల వెల్లడించిన ఓ అధ్యయనంలో కాంక్రీట్ నిర్మాణాలు పదిరెట్లు పెరగడం కారణంగా భూగర్భ నీటిమట్టాలు 79 శాతం తగ్గుముఖం పట్టాయని తెలిపింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ పరిస్థితి ఏమిటి అన్న చర్చ జరుగుతోంది. బెంగళూరు పట్టణ విస్తరణ 1973లో 8 శాతం ఉండగా, 2023 నాటికి 93.3 శాతానికి పెరిగింది. ఈమేరకు నీటి వనరులు పెరగలేదు. పట్టణ విస్తరణ పెరగడానికి, నీటి మట్టాలు తగ్గడానికి బలమైన సంబంధం ఉందని అధ్యయనం తెలిపింది. పట్టణం అంతా కాంక్రీట్ జంగిల్ కావడంతో నీరు ఇంకే అవకాశం లేక భూగర్భ జలాలు క్రమంగా పడిపోతూ వచ్చాయని వెల్లడించింది.ఇప్పుడు హైదరాబాద్ను ఈ నివేదిక భయపెడుతోంది. వాస్తవానికి తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రికార్డుల ప్రకారం హైదరాబాద్లో 185 నోటిఫైడ్ నీటి కుంటలు ఉన్నాయి. అయితే వీటిలో ఎక్కువ శాతం కలుషితం అవగా 20 వనరులు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో హైదరాబాద్కు కూడా నీటి సమస్య తప్పదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కోటిన్నర జనాభా ఉన్న గ్రేటర్ హైదరాబాద్ మహానగరానికి ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్, సింగూర్, మంజీరా, కృష్ణా 1,2, 3, గోదావరి ఫేజ్ 1 నుంచి నీటి సరఫరా జరుగుతుందని జలమండలి అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలోని కోర్ సిటీ GHMC 1098 MLD, ORR ఏరియాల్లో 270MLD, మిషన్ భగీరథ 150 MLD సరఫరా చేస్తున్నట్లు ప్రకటించారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది 4.12శాతం నీటి సరఫరాకు డిమాండ్ పెరిగిందన్నారు అధికారులు. హైదరాబాద్ మహానగరంలో నీటి సమస్యపై 1700 ప్రాంతాలు, 37వేల ఇండ్లలో సర్వే చేయించిన వాటర్ బోర్డు, డిమాండ్కు కారణం గ్రౌండ్ వాటర్ తగ్గడమే అని తేల్చినట్లు తెలిపారు. ఇప్పటికే 37 మందికి నోటీసులు కూడా జీహెచ్ఎంసీ నుంచి ఇచ్చినట్లు వివరించారు.నగరంలో వాటర్ సమస్య ఉన్నప్పటికీ గత ఏడాది మార్చి నెలలో 21వేల మంది కస్టమర్స్ వాటర్ ట్యాంకర్లు అడిగితే, ఇప్పుడు 31వేల ట్యాంకర్లకు డిమాండ్ పెరిగినట్లు తెలిపారు. మహానగర వ్యాప్తంగా 78 పిల్లింగ్ స్టేషన్లు ఉంటే 700 ట్యాంకర్లు 24 గంటల పాటు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఇప్పుడు ఒక నెల రోజుల్లో 1,50,000 ట్రిప్పులు నీళ్లను అందిస్తుంటే, మేలో రెండు లక్షల 50 వేలు, జూన్ జూలైలో మూడు లక్షల వారికి డిమాండ్ పెరిగే అవకాశం ఉంటుందని వాటర్ బోర్డు అంచనా వేస్తోంది. వీటన్నిటిని తట్టుకోవాలంటే ఇప్పుడున్న ట్యాంకర్లతో పాటు మరొక 300 ట్యాంకర్లను సైతం పెంచాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇప్పటికే 300 మంది డ్రైవర్లను సైతం తీసుకున్నామని, రెండు వందల మంది వరకు రిపోర్ట్ కూడా చేశారని వివరించారు.ఎలాంటి పరిస్థితులు వచ్చిన బేవరేజ్ కు వాటర్ ను ఆపే అవకాశం ఇవ్వలేదని స్పష్టం చేశారు ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్. డొమెస్టిక్ కంటే బేవరేజ్ నుంచే దాదాపు కేవలం 40 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని అన్నారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు అన్ని వస్తువులు కల్పిస్తామని అన్నారు దానికిషోర్.ప్రస్తుతానికి గ్రేటర్ హైదరాబాద్లో 2వేల MLD వాటర్ ను సప్లై చేస్తున్నామని భవిష్యత్తులో ఈ డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉన్నప్పటికీ ఎక్కడ ఇబ్బందులు లేకుండా చూస్తామంటున్నారు. నగర ప్రజలకు బెంగళూరు తరహా ఇబ్బందులు రావని రాబోవని పేర్కొన్నారు. కానీ అధికారుల ఏర్పాట్లు ఒకవైపు, గ్రౌండ్ లెవెల్ లో డిమాండ్ మరోవైపు చూస్తుంటే కచ్చితంగా రాబోయే రోజుల్లో నీటి కటకట తప్పే విధంగా లేదు అన్నట్లుగానే అనిపిస్తుంది. చూడాలి మరీ రాబోయే రెండు నెలల కాలాన్ని అధికారులు ఎలా హ్యాండిల్ చేస్తారో..! ఇప్పటికే సిటీ ఔట్కట్స్లో తీవ్ర నీటి సమస్య మొదలైంది. ఈ నేపథ్యంలో... ఇప్పటికైనా వర్షపునీరు భూమిలో ఇంకేలా చర్యలు చేపట్టాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. 200 చదరపు మీటర్ల కంటే ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వర్షపు నీటి గుంతలు ఏర్పాటు చేయాలని పేర్కొంటున్నారు. లేదంటే హైదరాబాద్ కూడా త్వరలోనే మరో బెంగళూరు అవుతుందని హెచ్చరిస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రంలోని రాజధానిలో డ్రగ్స్ మహమ్మారి యువతను పట్టిపీడిస్తోంది. ఇలాంటి డ్రగ్స్ మహమ్మారిపై ఎలా నిర్మూలించాలి అన్న విషయంపై "జయభేరి" కౌంటర్ శ్రీనివాస్ సమగ్ర విశ్లేషణ...

# యువతను పట్టి పీడించే మహమ్మారి డ్రగ్స్

✍ జయభేరి, హైదరాబాద్ :

లేలేత ప్రాయంలోనే విలాసాలకు అలవాటు పడ్డ యువత, అనతి కాలంలోనే జీవితాన్ని బుగ్గిపాలు చేసుకుంటుంది. తాజాగా హైదరాబాదులోని సనత్ నగర్ ఎండిఎం ఏ డ్రగ్స్ ముఠాను రాజేంద్రనగర్ ఎస్ఓటి పోలీస్ టీం సీజ్ చేసింది. ఈ సందర్భంగా డ్రగ్స్ అరికట్టాలంటే మనం ఏం చేయాలి !?తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి!? ముందు కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉందా!? లేదా!? అందరూ ప్రశ్నించుకుంటూ పోతే మరి సమాధానం ఎవరు చెప్పాలి. రాజకీయ లబ్ధి కోసం రాజకీయ నాయకులు రాజకీయాన్ని చేస్తున్న సామాజిక బాధ్యతను ఎవరు తీసుకోవాలి!? ప్రశ్నల పరంపర కొనసాగితే సమాధానం కరువైపోతుంది. అందుకే ఆ బాధ్యతను జయభేరి న్యూస్ గురుతర బాధ్యతగా తీసుకొని సమస్యల ప్రశ్నల పరిష్కారానికి నడుం కట్టింది. సమాజంలో పరిష్కారం కానీ ఎన్నో విషయాలపై ఖచ్చితమైన సమాధానాన్ని అందించే భాగంగా ప్రయత్నిస్తుంది. భారతీయ సనాతన ధర్మంలో ఎన్నో విషయాలు ఆధ్యాత్మిక ప్రబోధనల ద్వారా యువతకి సమాజానికి అందరికీ ఒక మంచి మెసేజ్ ను అందజేసింది. కానీ మారుతున్న కాలానికి మనుషులు మారుతున్న నేటి సమాజంలో, యువతను పట్టిపీడించేది డ్రగ్స్ గంజాయి గాంజా ...ఇలా ఏ పేరుతో పిలిచిన అది ఒక మత్తు పదార్థం.... పేర్లు వేరయినప్పటికీ ముఖ్యంగా యువతను పట్టి పీడిస్తున్న భూతాల్లో డ్రగ్స్ ఒకటి అని కచ్చితంగా చెప్పక తప్పదు. ముఖ్యంగా డ్రగ్స్ క్రయ విక్రయాలు చట్ట విరుద్ధమని తెలిసినప్పటికీ, కొంతమంది దుండగులు డబ్బు సంపాదన ధ్యేయంగా ఎంచుకొని, యువతకు గురిపెడుతూ, ఈజీగా డబ్బు సంపాదించడానికి అలవాటు పడిపోతున్నారు. యువతను డ్రగ్స్ మత్తు పదార్థాలకు అలవాటు చేసి నాశనం చేసే ఒక వైరస్ గా డ్రగ్స్ భూతం యువతను పట్టిపీడిస్తోంది. ముఖ్యంగా మన భారతదేశంలో కుటుంబ వ్యవస్థ చాలా పటిష్టంగా ఉంటుంది. అలాంటి మనదేశంలోని ప్రతి ఒక్క కుటుంబం కష్టపడి పని చేస్తూ పిల్లల్ని చదివించాలనే ఆలోచనలతో 80% మంది కుటుంబాలు ఉంటున్న.. మిగతా కుటుంబాల్లో వ్యాపార అభివృద్ధి తో పాటు విలాసాలకు విందులకు అలవాటు చేసే కుటుంబాలు లేకపోలేదు. పిల్లలు ఎప్పుడైతే కుటుంబ వ్యవస్థలో నుంచి క్రమశిక్షణ పద్ధతి నేర్చుకుంటారో, సమాజంలోకి వచ్చిన తర్వాత తోటి స్నేహితులకు తో విలాసాలకు అలవాటు పడి మారకద్రవ్యాల వలలో నేటి యువత పడుతోంది.

ఒకవైపు కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉండి కుటుంబంలో మంచి అలవాట్లే అలవర్చుకున్న అది విద్య వ్యవస్థలోకి వచ్చిన తర్వాత, తోటి స్నేహితులు విద్యా కళాశాల పరిసర ప్రాంతాలు కలుషితమై పోవడం, విద్యార్థులు విలాసాలతో తమ జీవితాన్ని మొదలు పెట్టుకోవడానికి ఎక్కువ అలవాటు పడుతుంటారు... దీని ద్వారా యువత లేలేత ప్రాయంలోనే విలాసాలతో తమ జీవితాన్ని ప్రారంభించుకొని మారకద్రవ్యాల మత్తు ఉచ్చులో నేటి యువత తమ జీవితాలను తామే బుగ్గి చేసుకుంటుంది.. ఎదిగే వయస్సులోని మత్తుకు బానిసై జీవితాన్ని బలి పెట్టుకుంటుంది నేటి యువత.



రాష్ట్రం విడిపోయిన తర్వాత తెలంగాణ అన్ని వ్యవస్థలో పతనం అయిందని రాజకీయ నాయకులు చెబుతున్నప్పటికీ కొంతమేర అభివృద్ధి జరిగిందనేది సత్యం. ప్రతిదీ మనం ప్రశ్నించుకుంటూ పోతే సమాధానం ఎవరు చెప్పాలి!? ప్రశ్నలు వేయడమే జీవితం కాదు సమాధానాలు వెతికి ఆ ప్రశ్నలకు మనమే ఒక సమాధానం అయితే ఆ జీవితం ఎంతో సంతోషంగా ఉంటుంది. నిజానికి విద్యార్థి దశలో ప్రాథమికంగా తల్లిదండ్రుల భయం, పాఠశాలల్లో టీచర్ల భయం, ఎక్కువగా ఉన్నప్పటికీ కళాశాల విద్యా వ్యవస్థలోకి వచ్చేసరికి యువత మత్తు వలయంలో చిక్కుకుంటుంది. దీని నుంచి కాపాడుకోవాలి అని అంటే ముఖ్యంగా యువత తమకు తామే తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లల పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. ఎందుకంటే తల్లిదండ్రులు కేవలం డబ్బు సంపాదనే ధ్యేయంగా పడి పిల్లలను కొంతమంది తల్లిదండ్రులు పట్టించుకోరు. దీని ద్వారా పిల్లలు చెడు అలవాట్లకు అలవాటు పడే స్నేహితులు ఎక్కువగా ఉండటం వల్ల, విద్యార్థి పరిస్థితి విషమించే వరకు చాలామంది తల్లిదండ్రులు వారి గురించి పట్టించుకోరు కనీసం మందలించరు. ఇలా చేస్తే కచ్చితంగా పిల్లల ఎదుగుదల పూర్తిగా నిలిచిపోయి అనది కాలంలోనే జీవితాన్ని బలి పెట్టుకోవాల్సి ఉంటుంది ఇది ఆదిలోనే మనం గుర్తించాల్సిన అవసరం ఉంది.

గంజాయి క్రయవిక్రయాలు దేశంలోనే కాదు మన నగరం నలుమూలల ఎక్కువగా క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. దీనిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన దగ్గర నుంచి డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టే వరకు ఊరుకోకూడదు. కఠిన నిర్ణయాలు తీసుకోండి. అని చెప్పిన ఇప్పటికే ఆయా పోలీసులకు ఆదేశాలు జారీ చేసిన సంగతి మనందరికీ తెలిసిందే... ఒకవైపు పోలీసు వ్యవస్థ రక్షణ వ్యవస్థ పటిష్టంగా ఉంటున్న ఊహలకు అందకుండా మారకద్రవ్యాల సేవనం దాదాపు యువత ప్రాణాలు బలి తీసే వరకు దారితీస్తోంది. అందుకనే కనీసం తల్లిదండ్రులు కచ్చితంగా ప్రతిరోజు పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలి.

అందుకు తగ్గ జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటికే ఆయా కుటుంబాల్లో పిల్లలు డ్రగ్స్ కలవాటు పడి విచిత్రంగా ప్రవర్తిస్తుండడం వలన ఆ కుటుంబాలు ఆ వేదన ఆ బాధ వర్ణనతీతంగా అనుభవిస్తున్నారు. ఇప్పటికే హైదరాబాదులో గంజాయి పూర్తిగా విస్తరించి రాష్ట్రంలో ప్రాంతాల్లో యువత మత్తుకు బానిస అయిపోయి సరదాగా సిగరెట్లు మద్యం తో చిన్న చిన్నగా మొదలై క్రమంగా మారకద్రవ్యాలు స్వీకరించే వరకు ఇది అలవాటు చేస్తోంది. దీని ద్వారా యువతలో ఆలోచన శక్తి మందగించి పూర్తిగా మత్తు వలయంలో చిక్కుకొని ప్రాణాలను పోగొట్టుకునే అవకాశం ఉంటుంది.

రంగారెడ్డి జిల్లా దుండిగల్ లో గంజాయి, పలు రకాలైన మొత్తం మందులను గతంలో పోలీసులు పట్టుకున్నారు. అలాగే ఈ కేసులో ముగ్గురిని అరెస్టు కూడా చేశారు. మొత్తానికి పోలీసులు తక్కువ టైంలో ఎక్కువ గంజాయి ముఠాలను పట్టుకుంటున్న యువతులు మాత్రం ఏ మాత్రం మార్పు రావడం లేదు. దీనికి ముఖ్యమైన కారణం అనతి కాలంలోనే ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో కొంతమంది కేటుగాళ్లు గంజాయి దందాకు తెర లేపుతున్నారు. దీని ద్వారా యువతను టార్గెట్ చేసుకొని మొదటగా సిగరెట్లలో పెట్టి ఆ తర్వాత మద్యంతో అలవాటు చేసి కొద్ది కొద్దిగా అలవాటు చేస్తుంది ఈ ముఠా...

ఈ విషయం అర్థం కాక ఎంతోమంది యువత విలాసాలకు విందులకు సంతోషాలకు అలవాటు పడి పూర్తిగా డ్రగ్స్ యువతపై ప్రభావం పడి పరిస్థితి విషమించే వరకు చూడకుండా ముఖ్యంగా వ్యవస్థలోని కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉండాలి. ఆ తర్వాత విద్య వ్యవస్థలోని కళాశాల వ్యవస్థ కూడా చుట్టూ పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకునే విధంగా ఉండాలి.

సరదాగా మొదలైన ఎన్నో చెడు అలవాట్లు మానవ జీవన విధానంపై పూర్తిగా దెబ్బతీసి పతనం చేస్తోంది. ఇలాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలంటే ముందుగా కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉండాలి. రక్షణ వ్యవస్థ పోలీస్ వ్యవస్థ ఎంత పనిచేసిన ముందుగా సమాజంలోని ప్రతి ఒక్క వ్యక్తి బాధ్యతగా తీసుకొని అది ప్రభుత్వానికి తోడ్పాటును అందించే విధంగా ఉండాలి. అలాగే కళాశాల ఆవరణలో కూడా పూర్తిగా విద్యార్థులకు మత్తు పదార్థాలు అందించకుండా ఉండేవిధంగా కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. మత్తు పదార్థాలకు అలవాటు పడితే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయి అని తెలిసే విధంగా పలు సోషల్ మీడియాలో అవగాహన కార్యక్రమాలు ఎక్కువగా కల్పించాలి. ఇలా అనేక ప్రశ్నలకు సమాధానాలను మనమే వెతికి సమాజాభివృద్ధికి సమాజ హితానికి మనమే మొదటి మెట్టు అవ్వాలి. ప్రశ్నించుకుంటూ పోతే సమాజంలో అన్ని ప్రశ్నలే మిగులుతాయి. కానీ సమాధానాలు వెతుక్కుంటూ పోతే ఆ జీవితం ఎంతో హాయిగా ఆరోగ్యవంతమైన సమాజాన్ని మనమే నిర్మించగలుగుతాం....



✍ కదారి శ్రీనివాస్
కాలమిస్ట్, సీనియర్ జర్నలిస్ట్, కవి, రచయిత
గాయకులు, సామాజిక ఉద్యమకారులు

## భారీగా పెరిగిన చికెన్ ధరలు

✍ జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 10:

రంజాన్ పండుగ ముంగిట చికెన్ ధరలు భారీగా పెరగడంతో నాన్ వెజ్ ప్రియులకు షాక్ తగిలినట్టయింది. గతవారం రోజులుగా చికెన్ ధరలు పెరగడంతో రంజాన్ పండుగ జరుపుకునే మైనార్టీ సోదరులకు బడ్జెట్ పెరగనుంది. అయితే రెండురోజులుగా చికెన్ కిలో రూ.105 నుంచి రూ.115 వరకు, స్కిన్ లెస్ కిలో రూ.290, బోన్ లెస్ రూ.400 వరకు రిటైల్ మార్కెట్లో విక్రయించారు. అయితే ఎండాకాలంలో కోళ్ల మరణాల రేటు ఎక్కువగా ఉండటం ధరలు పెరగడానికి అసలు కారణమని వ్యాపారులు చెబుతున్నారు.వేడిని తట్టుకోలేక కోళ్లు పెద్ద సంఖ్యలో మృత్యువాత పడుతుండటంతో రైతులు నష్టపోతున్నారు. ఇక వారం క్రితం కిలో కోడి మాంసం ధర రూ.180 నుంచి రూ.220 వరకు ఉండేది. వేసవిలో కోళ్ల సరఫరా తక్కువగా ఉండటం కూడా ధరల పెరుగుదల కారణమవుతోంది. పౌల్ట్రీ రైతులు ఎయిర్ కూలర్ల ఏర్పాటు, ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ కోళ్లను పెంచుతున్నారు. అధిక డిమాండ్, తక్కువ సరఫరా కారణంగా ఈ నెలలో ధరలు విపరీతంగా పెరిగాయి. ఆదివారం చికెన్ కిలో రూ.115 నుంచి రూ.125 వరకు ఉండగా, నెల క్రితం రూ.70 నుంచి రూ.80 మధ్య ఉంది.ఈ నెలలో ఈద్ ఉల్ ఫితర్ తర్వాత భారీగా పెళ్లిళ్లు జరుగుతుండటంతో చికెన్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో మెనూను తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందంటున్నారు చాలామంది. చికెన్ ధరలు పెరగడమే ఇందుకు కారణమని ఫుడ్ కేటరర్లు కూడా చెబుతున్నారు. ఎండల తీవ్రత ఇలాగే కొనసాగితే మున్ముందు భారీగా ధరలు పెరిగే అవకాశం ఉంది. అయితే రంజాన్ సందర్భంగా మైనార్టీ సోదరులు ఎక్కువగా నాన్ వెజ్ తింటారు. అయితే పండుగ సందర్భంగా ధరలు పెరగడం షాక్ లాంటిదే.

## ఉగాది పండుగ రోజు తప్పని తిప్పలు..



- తాగడానికి వాడుకోవడానికి నీళ్లే దొరకత లేవు...!?
- ఇంటి ఓనర్లు కూడా కనికరం చూపటం లేదు.
- పబ్లిక్ వాటర్ ట్యాంకర్ ముందు ఒకరికొకరు కొట్టుకునే పరిస్థితి...
- పార్శిగుట్ట సంజీవపురం కాలనీలో నివసిస్తున్న సంధ్య, నిర్మల, లావణ్య, కుమారి, అనే మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారంటూ అభ్యర్థిస్తున్నారు

✍ జయభేరి, పార్శి గుట్ట:

తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు కష్టాలు కన్నీళ్లు రానీయకుండా ఉంటామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా పనిచేయటం లేదు అని చెప్పడానికి ఇదిగో నిదర్శనం. సికింద్రాబాద్ పార్సిగుట్ట పలు ప్రాంతాల్లో మంచినీరు సరిగ్గా రాక వచ్చిన ఆ నీళ్లు కూడా తక్కువ సమయంలో బంద్ కావడంతో సంజీవపురం పార్సిగుట్ట అడ్డగుట్ట పలు ప్రాంతాల్లో నీటి సమస్యలు ఎక్కువవుతున్నాయి. తాగడానికి మంచినీరు ఒకవైపు అందకపోవడంతో ఇంకోవైపు కనీస అవసరాలకు కూడా ఖర్చుకు లేకుండా పోతున్నాయి అని చెప్పడానికి ఇది మంచి ఉదాహరణ. కానీ పార్శి గుట్ట సంజీవపురం కాలనీలో ఏఈ ప్రియాంక మాట్లాడుతూ ఆన్లైన్లో బుక్ చేసుకున్న వారికి ఒకటి రెండు రోజుల్లో వాటర్ ట్యాంకర్ పంపిస్తున్నామని చెబుతున్న కనీస అవసరాల కోసం నీళ్లు అందక ప్రజలు నానా ఇబ్బంది పడుతున్నారు. ఇంకోవైపు కిరాయి ఇండ్లలో ఉన్న ప్రజలు నీటికి ఇబ్బంది పడుతున్న ఇంటి ఓనర్లు మాత్రం కనికరం చూపకుండా వాటర్ ట్యాంకర్ నుంచి కిరాయిదారులకు కనీసం ఒక చుక్క నీరు కూడా ఇవ్వకపోవడంతో.. ఇంట్లో కిరాయి కుండే వాళ్లు నాన ఇబ్బంది పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నీటి కష్టాలు తప్పడం లేదు దేవుడా అని మొరలు పెట్టుకుంటున్నారు.. ఇప్పటికైనా వాటర్ వర్క్ అధికారులు దయుంచి పార్శి గుట్ట సంజీవపురం కాలనీలో నల్ల నీళ్లు ఎక్కువసేపు విడుదల చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు... లేనిపక్షంలో ఎండాకాలం మరొక నెల ఉన్న కారణంగా ఇంకెక్కువ నీటి కష్టాలు తప్పవంటూ అధికారులను ప్రాధేయపడుతున్నారు.

# రాముడిని మొక్కుదాం.. బీజేపీని తొక్కుదాం..

✍ జయభేరి, మేడిపల్లి :

మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎంకెబీఆర్ కన్వెన్షన్ నందు జరిగిన ఉమ్మడి ఘట్కేసర్ మండల బిఆర్ఎస్. సన్నాహక సమావేశం లో ముఖ్య అతిధిగా మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. ఉగాది పచ్చడి లో ఉన్న ఆరు రుచుల మాదిరి జీవితంలో కూడా అన్నీ ఉంటాయి...స్వలాభం కోసం కొంత మంది నాయకులు ఇతర పార్టీలకు వెళ్లినా మన పార్టీకి ఎలాంటి నష్టం లేదు. ప్రజలు ఇచ్చిన ప్రధాన ప్రతిపక్షం భాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని, 420 హామీలిచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనిక్కింది. రైతులకిచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. ఆడబిడ్డల కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ఇప్పటికీ అమలు కాలేదు.రుణమాఫీకి దిక్కులేదు.ఒక ముఖ్యమంత్రి మాట్లాడే మాటలు రేవంత్ రెడ్డి మాట్లాడటం లేదు. రేవంత్ రెడ్డి ఐదేళ్లు ముఖ్యమంత్రి గా ఉండాలని కోరుకుంటున్నాను. నీ ప్రభుత్వాన్ని పడగొట్టాల్సిన ఖర్మ మాకు లేదు, నీ పక్కనే ఉన్నాయి. ఫోన్ ట్యాపింగ్ మీద పెట్టిన శ్రద్ధ మంచినీళ్ల మీద పెట్టు. రైతు బంధు, దళిత బంధు, రంజాన్ తోఫా, క్రిస్మస్ గిఫ్ట్, బతుకమ్మ చీరలు సహా అన్ని రద్దు చేశారు. రాహుల్ భారత్ జోడో యాత్ర అని దేశమంతా తిరుగుతుంటే రేవంత్ రెడ్డి ప్రధాని మోదీ నా పెద్దన్న అంటాడు.. లిక్కర్ స్కామ్ జరగలేదని రాహుల్ అంటే లేదు లిక్కర్ స్కామ్ జరిగిందని రేవంత్ అంటాడు. కాంగ్రెస్ లో రాహుల్, రేవంత్ రెండు నాలుకలు. ఖచ్చితంగా రేవంత్ రెడ్డి కేసులు తప్పించుకోవడం కోసం బీజేపీలో చేరుతాడు.



ఒక్క సీటు కూడా రాదన్న రేవంత్ రెడ్డి నేను విసిరిన ఛాలెంజ్ పట్ల సప్పుడు లేదు. ప్రజలందరూ ఆలోచించాలి. ఎవరు సంక్షేమ పథకాలు అందించారో వారికి ఓటు వేయండి. పదేళ్లు దేశాన్ని నడిపిన మోదీ తెలంగాణకు రూపాయి ఇచ్చింది లేదు. ఒక్క రూపాయి కూడా తెలంగాణాలో రుణమాఫీ చేసింది లేదు. ఈటలకు ఓటు వేసినా ఇక్కడ ఉండడు, హుజురాబాద్ వెళ్ళిపోతాడు. లోకల్ అభ్యర్థి రాగిడిని గెలిపించాలి. రాముడిని మొక్కుదాం.. బీజేపీని తొక్కుదాం.. రాముడి పేరు చెప్పుకుని రాజకీయం చేసే బీజేపీని తన్ని, తరిమేద్దం..సీఎం గుంపు మెస్త్రి అయితే ప్రధాని తాపీ మేస్త్రి..ఇద్దరు కలిసి తెలంగాణను ఆగం చేయాలని చూస్తున్నారు.బీజేపీకి ప్రేమ ఉంటే భద్రాచలం రాముడికి ఒక రూపాయి కూడా ఖర్చు చేయలదు.. అయోధ్యలో ఉన్నది రాముడే, భద్రాచలంలో ఉన్నది కూడా రాముడే..బీజేపీ మతోన్మాదాన్ని అరికట్టాలి..కారు గుర్తుకు ఓటు వేసి రాగిడిని గెలిపించాలి.

మాజీ మంత్రి మాల్లారెడ్డి మాట్లాడుతూ.. మల్కాజిగిరి పార్లమెంట్లో రాగిడి లక్ష్మారెడ్డికి భారీ మెజారిటీ ఖాయం.. 20 ఏళ్లుగా ప్రజా సేవలో ఉన్న వ్యక్తి రాగిడి.. బి.ఆర్.ఎస్. ను రెండు జాతీయ పార్టీలు కలిసినా ఏమి చేయలేవు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత మోసం చేస్తుందని ప్రజలు ఉహించలేదు. నాలుగు నెలల్లోనే ప్రజలకు అర్థమైంది.తెలంగాణా అభివృద్ధి పథకాలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం బంద్ చేసింది. కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ కూడా తెలంగాణా ప్రజలకు చేసిందేమీ లేదు.ప్రజలందరూ బి.ఆర్.ఎస్. కు ఓటు వేయాలని పిలుపు.

మల్కాజిగిరి బిఆర్ఎస్. పార్లమెంట్ అభ్యర్థి రాగిడి మాట్లాడుతూ...నన్ను నమ్మి మల్కాజిగిరి టికెట్ కేటాయించిన కేసీఆర్ కు ధన్యవాదాలు.. తెలంగాణా అన్ని రకాలుగా అభివృద్ధి సాధించిందంటే పదేళ్ల కేసీఆర్ పాలనలోనే.. బీజేపీ, కాంగ్రెస్ మ్యాచ్ ఫిక్సింగ్ లో ఉన్నారు. ప్రజలు గమనించాలి.రాబోయే ఎన్నికలలో కారు గుర్తుకు ఓటు వేసి నన్ను గెలిపించాలి.

ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. హుజురాబాద్ లో చెల్లని రూపాయి మల్కాజిగిరిలో ఎలా చెల్లుతుంది.. 20 ఏళ్ళు ఎమ్మెల్యేగా ఉండి హుజురాబాద్ ను అభివృద్ధి చేసింది లేదు.ఒక్కరోజు కూడా బొట్టు పెట్టని ఈటల నేడు హిందుత్వం గురించి మాట్లాడుతున్నాడు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మన కేసీఆర్, కేటీఆర్ వెంట్రుక కూడా పీకలేరు..బీజేపీ తో కుమ్మక్కై కావాలనే మల్కాజిగిరి లో కాంగ్రెస్ నుండి డమ్మీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డిని నిలబెట్టారు. బి.ఆర్.ఎస్. కార్యకర్తలు అందరూ ధైర్యంగా ఉండి పార్లమెంట్ ఎన్నికల కోసం కష్టపడాలి.మల్కాజిగిరి లో రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలి.

మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ పీర్జాదిగూడ నగరానికి ఎన్నో ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేశారని మల్కాజ్గిరి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా నిలిచి భారీ మెజారిటి తో గెలిపించి కేసీఆర్ కు గిఫ్ట్ గా ఇవ్వాలన్నారు.





## కాంగ్రెస్ పార్టీలోకి బిఆర్ఎస్ కౌన్సిలర్లు

✍ జయభేరి, మేడ్చల్ :

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మేడ్చల్ మున్సిపాలిటీలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఇప్పటికే పలువురు కౌన్సిలర్లను పార్టీలోకి చేర్చుకున్న కాంగ్రెస్ వైస్ చైర్మన్ తో సహా మరో తొమ్మిది మంది కౌన్సిలర్లకు గళంవేసింది. దీంతో మేడ్చల్ మున్సిపాలిటీలో బిఆర్ఎస్ దాదాపు ఖాళీ అయింది. గత కొంత కాలంగా మాజీ మంత్రి ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేడ్చల్ చైర్ పర్సన్ ఏకపక్ష నిర్ణయాలు నచ్చకపోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్న కౌన్సిలర్లతో మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ పలుమార్లు చర్చలు జరిపి వారందరూ కాంగ్రెస్ పార్టీలో చేరితే మంచి భవిష్యత్తు ఉంటుందనే సూచనతో వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో మేడ్చల్ మున్సిపాలిటీకి చెందిన వైస్ ఛైర్మన్ తో సహా 9 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారికి సీఎం రేవంత్ రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో వైస్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్లు దేవా, స్వామియాదవ్, శివ కుమార్, మనసా శ్రవణ్, సాయికుమార్, సుహాసిని రవీందర్, ప్రియాంక మధుకర్, నారెడ్డి కృష్ణవేణి రవీందర్, సాటే మాధవి నరేందర్ ఉన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి గెలుపు కోసం అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## రంజాన్ పండుగ శుభాకాంక్షలు

- దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్

✍ జయభేరి, దేవరకొండ :

దేవరకొండ నియోజకవర్గం లోని ముస్లిం మైనార్టీ సోదర సోదరీమణులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ముస్లిం మైనార్టీ సోదర సోదరీమణులకు ఆనందాల మధ్యన రంజాన్ వేడుకలు జరుపుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ ఆకాంక్షించారు. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు అల్లాను వేడుకుంటూ నెల రోజుల పాటు పవిత్రమైన ఉపవాస దీక్షలు నిర్వహించి, నేడు జరుపుకునే పండగ వారి కుటుంబాలలో ఆనందాలను విరజల్లాలని తెలియజేశారు. సోదర భావంతో హిందూ ముస్లిం భాయ్ భాయ్ అనే లౌకికవాద తత్వాన్ని కాంగ్రెస్ పార్టీ విడనాడ లేదని అన్నారు. ముస్లిం సోదరుల పండగలకు హిందువుల సోదరుల పండుగలకు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఒకరి పండగల్లో మరొకరు కలిసి చేసుకునే సాంప్రదాయం దేవరకొండ నియోజకవర్గంలో ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ పర్వ దిన వేడుకలు ఘనంగా జరుపుకోవాలని కోరారు.

## పంచాంగ ఆవిష్కరణ




✍ జయభేరి, దేవరకొండ :

దేవరకొండ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవి క్లబ్ వాసవి వనిత క్లబ్ గ్రేటర్ దేవరకొండ ఆధ్వర్యంలో శ్రీ క్రోదినామ సంవత్సర ఉగాది పంచాంగ ఆవిష్కరణ క్లబ్ సభ్యులు పంచాంగ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు నీల బిక్షమయ్య కార్యదర్శి ఆతుకూరి ఆంజనేయులు కోశాధికారి కండే సత్యనారాయణ వనిత క్లబ్ అధ్యక్షురాలు తొనుకునూరు విజయ కార్యదర్శి మంచి కంటి పద్మ కోశాధికారి కుంచకూరి శిరీష IPC గోవిందు కొండయ్య శైలజ జోన్ చైర్మన్ ఆలంపల్లి పద్మ డిస్టిక్ చైర్మన్ అర్థం రమేష్ గుద్దేటి జంగయ్య బెజవాడ నరేందర్ నీలా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ మేరీ సెంట్రల్ స్కూల్ లో రంజాన్ వేడుకలు



- వేడుకల్లో పాల్గొన్న స్కూల్ కరస్పాండెంట్ ఏళ్ళు వరప్రసాద్ రెడ్డి, తిరుపతి రెడ్డి
- మతసమరస్యాలకు ప్రతీక రంజాన్ పండుగ- కరస్పాండెంట్ ఏళ్ళు వరప్రసాద్ రెడ్డి

✍ జయభేరి, ఏప్రిల్ 10 :

మేడ్చల్ జిల్లా శామిర్ పేట్ మండలం తుర్కపల్లిలోని సెయింట్ మేరీ సెంట్రల్ స్కూల్లో ఘనంగా రంజాన్ వేడుకలు నిర్వహించారు. ఇందులోభాగంగా విద్యార్థులు రంజాన్ దుస్తులు ధరించి ఒకరినొకరు ఆలింగనాలు చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కాగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏళ్ళు తిరుపతి రెడ్డి, స్కూల్ కరస్పాండెంట్ ఏళ్ళు వరప్రసాద్ రెడ్డి హాజరై ముస్లిమ్ సోదరులకు మరియు విద్యార్థుల తల్లిదండ్రులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కులమతాలకు అతీతంగా ఈ రంజాన్ వేడుకల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని వారు తెలిపారు. పండుగ లు మన సంస్కృతి సంప్రదాయాలను తెలియచేస్తాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఇంచార్జ్ గ్రేస్, గౌసియా, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.





## పోలీసుల పనితీరుపై ప్రశంసల వర్షం


- మహిళ మెడలో నుండి బంగారు గొలుసు ను అపహరించిన వ్యక్తిని అరెస్ట్ చేసిన అల్వాల్ పోలీసులు
- గంటల వ్యవధిలోనే నిందితున్ని పట్టుకోవడంతో హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు
- అనుమానాస్పద వ్యక్తుల పట్ల సమాచారం అందించాలని పోలీసుల విజ్ఞప్తి

✍ జయభేరి, ఏప్రిల్ 10 :

ఇంట్లో ఎవరూ లేని సమయంలో నీళ్లు కావాలని వచ్చి మహిళ మెడలో నుండి ~~బంగారు గొలుసుని అపహరించుకెళ్లిన సంఘటన మేడ్చల్ జిల్లా అల్వాల్~~ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాగర్ కర్నూలు జిల్లాకు చెందిన దేశమోని సాయితేజ బ్రతుకు దెరువు నిమిత్తం నగరానికి వచ్చి అల్వాల్ పరిధిలోని అంజనపురి కాలనీలో ని ఓ ఇంట్లో మిత్రునితో పాటు కిరాయికి ఉంటున్నాడు. ఇతను ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే చాలి చాలని వేతనంతో విసిగిపోయిన అతను డబ్బు సంపాదించాలని అత్యాశ తో చోరీల బాట పట్టాడు. ఇదే క్రమంలో ఈ నెల 9న మధ్యాహ్న సమయంలో అదే కాలనిలో గల ఓ అపార్ట్ మెంట్ లో గ్రౌండ్ ఫ్లోర్ లో ఒంటరిగా ఉన్న మహిళ ఇంటికి మంచినీళ్లు కావాలని అడగ్గా,అతడిపై అనుమానం వచ్చి డోర్ పెడుతుండగా ఒక్కసారిగా ఆమె గొంతు పట్టుకుని మెడలో ఉన్న బంగారు గొలుసు తో పాటు, చెవి పోగలు తెంచుకుని పారిపోయాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. కాగా అదే రోజు సాయంత్రం సమయంలో అదే ఏరియాలో అనుమానస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో అతను చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. అతని వద్ద నుండి దొంగలించిన సొత్తును స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించారు. కాగా నిందితున్ని త్వరగా పట్టుకున్నందుకు గాను ఇన్స్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రాహుల్ దేవ్ నేతృత్వంలో ని డిటెక్టివ్ ఇన్స్ స్పెక్టర్ రాజేందర్ గౌడ్, క్రైమ్ సిబ్బంది విద్యాకర్ రావ్, గోపి పాషా, రమాకాంత్ సుధాకర్ లను అభినందించారు. వారికి రివార్డులు అందచేస్తామని ప్రకటించారు. కాగా మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో చోరీ జరగగా సాయంత్రం లోగా నిందితున్ని పట్టుకుని సొత్తును రికవరీ చేయడం పట్ల పోలీసుల పనితీరుపై స్థానికులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. అదేవిధంగా 2 రోజుల క్రితం బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను కూడా గంటల వ్యవధిలోనే పట్టుకుని వాటిని రికవరీ చేయడంతో ఇంకా పోలీసుల పనితీరుపై శభాష్ అంటూ మెచ్చుకుంటున్నారు. ఇదే తరహాలో ముమ్మందు కూడా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.




## ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) కోసం ఏర్పాట్లు పూర్తి




✍ జయభేరి, దేవరకొండ :

నేడు గురువారం జరగబోయే రంజాన్ పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని దేవరకొండ ఈద్గాహ్ కమిటీ పేర్కొంది. నగరంలో ప్రధానంగా ఈద్గాహ్ వద్ద జరగబోయే Eid ul Fitr ప్రత్యేక నమాజ్ కోసం ఏర్పాట్లు పూర్తి చేశామని ఈద్గాహ్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ అజీమోద్దీన్, మహ్మద్ ఇలియాస్ పటేల్ లు పేర్కొన్నారు, ఈ సందర్భంగా బుధవారం వారు ఓ ప్రకటన విడుదల చేస్తూ.. రేపు ఉదయం 9 గంటలకు ఈద్గాహ్ వద్ద ప్రత్యేక నమాజ్ ఉంటుందన్నారు. త్రాగునీరు, వజూ నీరు కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయని, వృద్ధులు వికలాంగులకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఈద్గాహ్ వద్ద పార్కింగ్ కోసం కేటాయించిన స్థలంలో తమతమ వాహనాలను పార్క్ చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. బందోబస్తులో ఉన్న పోలీస్ వారికి పూర్తి స్థాయిలో సహకరించాలని తెలిపారు, నమాజ్ కు వచ్చే వారు తమ వెంట జానిమాజ్ తీసుకోరావాలని ఈ సందర్భంగా కమిటీ కోరింది. అదేవిధంగా ఈద్గాహ్ వద్ద నమాజ్ అందనివారికి 9 : 30 గంటలకు నగరంలోని జామియా మస్జిద్ లో ఏర్పాట్లు చేశామన్నారు. ఒకవేళ పండుగ రోజు వర్షం కురిస్తే నగరంలోని ప్రధాన మసీదులైన మక్కా మస్జీద్, జామియా మస్జీద్, అఖ్సా మస్జీద్ లలో ఉదయం 9 : 00 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని తెలిపారు. ప్రకటన విడుదల చేసిన వారిలో కమిటీ సభ్యులు మహ్మద్ షబ్బీర్ అహ్మద్, మహ్మద్ అబ్దుల్ ఖదీర్, సయ్యద్ అజీజ్, మహ్మద్ షకీల్, మహ్మద్ ముజీబ్, మహ్మద్ సలీం, ఎస్ కె బురాన్, ఖాజా మొయిమొద్దీన్, మహ్మద్ షబ్బీర్, ఎస్ కె మంజూర్, యండి జాఫర్, యండి అఫ్రోజ్, మహ్మద్ ఖైసర్, ఎస్ కె ఇల్యాస్ బాబా లతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## రంజాన్ నీ ప్రశాంతంగా జరుపుకోవాలి

- రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్
- BLR చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం.

**జయభేరి, కాప్రా :**

ఉప్పల్ నియోజకవర్గం లోని మస్జిద్ లకు ఇమామ్, మోజన్ లకు రంజాన్ సందర్భంగా సైనిక్ పూరి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్ ఆర్ ట్రస్ట్ ద్వారా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా నూతన దుస్తులు అందచేయడం జరిగింది. స్పీకర్ మాట్లాడుతూ. రంజాన్ మాసంలో ఎంతో నిష్ఠగా, కఠోర ఉపవాసాలు ఉండి పండుగ జరుపుకుంటున్న సందర్భంగా ఇమామ్ మరియు మోజన్ లకు సాంప్రదాయ నూతన దుస్తులు అందజేస్తున్న బి ల్ ఆర్ ట్రస్ట్ వారికి అభినందనలు తెలియచేసారు. అలాగే రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియచేసారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం దుస్తులు పంపిణీ చేస్తామని లాస్ట్ ఇయర్ మినిస్టర్ క్వార్టర్స్ లో మాజీ హోం శాఖ మంత్రి మహమ్మద్ అలీ చేతుల మీదుగా ఇచ్చామని ఈసారి స్పీకర్ చేతుల మీదుగా ఇచ్చామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ బి ఆర్ ఎస్ పార్టీ మైనారిటీ చైర్మన్ మహమ్మద్ బద్రుద్దీన్, నాయకులు ఎస్ ఏ రహీం, మహేమోద్, నయీామ్, సలీం, కరీం తదితరులు పాల్గొన్నారు.



సిగ్నేచర్ ఐఏఎస్ అకాడమీ"ని ప్రారంభించిన స్పీకర్ గడ్డం ప్రసాద్, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఉప్పల్ డిపో వద్ద గల చెన్నారెడ్డి ఎన్క్లేవ్ లో నూతనంగా ఏర్పాటుచేసిన "సిగ్నేచర్ ఐఏఎస్ అకాడమీ"ని స్పీకర్ గడ్డం ప్రసాద్ గారు,కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్యాదవ్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీరజాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**జయభేరి, మేడిపల్లి**

## ముస్లిం సోదరసోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు

- మేయర్ జక్క వెంకట్ రెడ్డి



**జయభేరి, మేడిపల్లి :**

రంజాన్ పర్వదినం (ఈద్ ఉల్ ఫితర్) సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముస్లిం సోదరసోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షల మాసం క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన, దాతృత్వం, ప్రేమ,క్షమ,దయ,ఉపకారం, సోదరభావం ,ఐక్యతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు.పవిత్ర ఖురాన్ అవతరించిన మాసంలో ముస్లింలు ఉపవాసాలు ఉంటూ ఆధ్యాత్మిక చింతనతో ప్రత్యేక ప్రార్ధనలు, దానధర్మాలు చేస్తుంటారన్నారు.తెలంగాణ సమాజం "గంగా, జామునా తహజీబ్" మత సామరస్యానికి ప్రతీక అన్నారు. ముస్లింలు తమ ఉపవాస దీక్షలు విరమించి భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.




**ఐపీఎల్17లో పంజాబ్ హైదరాబాద్ మధ్య ముగిసిన ఉత్కంఠ మ్యాచ్‌ను మరిచిపోకముందే మరో ఆసక్తికకర పోరు అభిమానులను అలరించింది. వరుస విజయాలతో దూసుకుపోతున్న రాజస్తాన్ రాయల్స్ జోరుకు గుజరాత్ టైటాన్స్ కళ్లెం వేసింది. ఆఖరి బంతికి ఫలితం తేలిన ఈ మ్యాచ్‌లో రాయల్స్‌కు ఓటమి రుచి చూపించింది. బౌలింగ్‌లో విఫలమైనా బ్యాటింగ్‌లో గుజరాత్ సమిష్టిగా ఆడి విక్టరీ కొట్టింది. ఛేదనలో గుజరాత్‌కు గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా ఆఖర్లో రాహుల్ తెవాటియా, రషీద్‌ఖాన్ మెరుపులతో రాజస్తాన్‌కు ఓటమి తప్పలేదు.**

# ఆఖరి బంతికి గుజరాత్ గెలుపు

- రాజస్థాన్ రాయల్స్‌కు తొలి ఓటమి..
- ఉత్కంఠ పోరులో టైటాన్స్ పైచేయి
- శాంసన్, పరాగ్ ఇన్నింగ్స్ వృథా

ఐపీఎల్ 17లో వరుసగా నాలుగు మ్యాచ్‌లు గెలిచిన రాజస్తాన్ రాయల్‌స్‌కు గుజరాత్ తొలి షాక్ ఇచ్చింది. జైపూర్‌లోని సవాయ్‌మాన్‌సింగ్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో 3 వికెట్ల తేడాతో రాయల్‌స్‌ను ఓడించింది. పలుమార్లు వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి ముందు బ్యాటింగ్ చేసిన రాజస్తాన్.. రియాన్ పరాగ్ (48 బంతుల్లో 76, 3 ఫోర్లు, 5 సిక్సర్లు), కెప్టెన్ సంజూ శాంసన్ (38 బంతుల్లో 68 నాటౌట్, 7 ఫోర్లు, 2 సిక్సర్లు) సమయోచిత ఇన్నింగ్‌స్‌లతో రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 196 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో గుజరాత్.. 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. ఆ జట్టు సారథి శుభ్‌మన్ గిల్ (44 బంతుల్లో 72, 6 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధ సెంచరీతో పోరాడగా సాయి సుదర్శన్ (29 బంతుల్లో 35, 3 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. ఆఖర్లో రాహుల్ తెవాటియా (11 బంతుల్లో 22, 3 ఫోర్లు), రషీద్ ఖాన్ (11 బంతుల్లో 24 నాటౌట్, 4 ఫోర్లు) లు అద్వితీయ పోరాడటంతో గుజరాత్ గెలుపుబాట పట్టింది. రషీద్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. రాజస్తాన్ ఇన్నింగ్స్ నెమ్మదిగానే మొదలైంది. ఈ సీజన్‌లో వరుసగా విఫలమవుతున్న యశస్వీ జైస్వాల్ (19 బంతుల్లో 24, 5 ఫోర్లు) టచ్‌లోకి వచ్చినట్టే కనిపించినా ఉమేశ్ యాదవ్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ మాథ్యూ వేడ్ సూపర్ క్యాచ్ పట్టడంతో వెనుదిరిగాడు. ఆర్సీబీతో గత మ్యాచ్‌లో సెంచరీ చేసిన బట్లర్ (8) మరోసారి రషీద్ స్పిన్ మాయాజాలానికి తలవంచక తప్పలేదు. ఓపెనర్లు నిష్క్రమించాక వచ్చిన శాంసన్, రియాన్ పరాగ్.. క్రీజులో కుదురుకునేదాకా బంతికోపరుగు అన్నట్టుగానే ఆడారు. కానీ 12వ ఓవర్ నుంచి ఇద్దరూ గేర్ మార్చారు. నూర్ అహ్మద్ వేసిన ఆ ఓవర్లో రెండు సిక్సర్లు బాదిన పరాగ్.. మోహిత్ శర్మ వేసిన తర్వాతి ఓవర్లో మరో సిక్సర్ కొట్టి 34 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్నాడు. 15వ ఓవర్లో శాంసన్.. స్పెన్సర్ జాన్సన్‌ను లక్ష్యంగా చేసుకుని రెండు ఫోర్లు, సిక్సర్‌తో స్కోరుబోర్డు వేగాన్ని పెంచాడు. మోహిత్ వేసిన 17వ ఓవర్లో ఆఖరి బంతికి లాంగాన్ దిశగా బౌండరీతో అతడూ ఈ సీజన్‌లో మూడో అర్ధ శతకం పూర్తిచేసుకున్నాడు. 78 బంతుల్లో 130 పరుగులు జోడించిన ఈ జోడీని మోహిత్ శర్మ విడదీశాడు.

8 ఓవర్లకు 52/2గా ఉన్న రాజస్తాన్ స్కోరు 20 ఓవర్లకు 196/3గా ముగిసిందంటే అది ఈ ఇద్దరి చలవే. భారీ ఛేదనలో గుజరాత్‌కు శుభారంభమే దక్కినా ఓపెనర్లు ధాటిగా ఆడలేకపోయారు. రాజస్తాన్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో గుజరాత్ స్కోరు వేగం పుంజుకోలేదు. 8.2 ఓవర్లలో 64 పరుగులు జోడించిన ఈ జోడీని కుల్‌దీప్ సేన్ విడదీశాడు. 2 ఓవర్ల వ్యవధిలో అతడు మూడు కీలక వికెట్లు పడగొట్టి గుజరాత్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. సాయి సుదర్శన్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్న కుల్‌దీప్.. వేడ్, అభినవ్‌ను ఒకే ఓవర్లో క్లీన్‌బౌల్డ్ చేశాడు. విజయ్ శంకర్ (16)ను చాహల్ బలిగొన్నాడు. క్రీజులోకి వచ్చినోళ్లు వచ్చినట్టే సహచర ఆటగాళ్లు వెనుదిరుగుతున్నా పట్టుదలతో ఆడిన గిల్ 35 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. ఆఖరి 5 ఓవర్లలో ఆ జట్టు విజయానికి 73 పరుగులు అవసరం కాగా.. చాహల్.. గిల్‌ను బోల్తా కొట్టించాడు. షారుక్ ఖాన్ (14)ను అవేశ్ ఖాన్ ఎల్బీగా వెనక్కిపంపాడు. కానీ తెవాటియా, రషీద్ ఆఖర్లో అద్భుతంగా పోరాడారు. కుల్‌దీప్ 19వ ఓవర్లో ఈ ఇద్దరూ 20 పరుగులు రాబట్టారు. చివరి ఆరు బంతుల్లో గుజరాత్ విజయానికి 15 పరుగులు అవసరం కాగా గత రెండు మ్యాచ్‌లలో రాజస్తాన్‌ను గెలిపించిన అవేశ్ ఖాన్.. ఈసారి విఫలమయ్యాడు. రషీద్ ఖాన్ బౌండరీలతో విరుచుకుపడి రాయల్‌స్‌కు షాకిచ్చాడు.

**సంక్షిప్త స్కోర్లు**

రాజస్తాన్ : 20 ఓవర్లలో 196/3 (పరాగ్ 76, శాంసన్ 68 నాటౌట్, రషీద్ 1/18, ఉమేశ్ 1/47).

గుజరాత్ : 20 ఓవర్లలో 199/7 (గిల్ 72, సాయి 35, కుల్‌దీప్ 3/41 , చాహల్ 2/43)

# వేసవిలో చెరుకు రసాన్ని తాగాల్సిందే..



చెరుకురసం ఆరోగ్యానికి మంచిది. అయితే వేసవిలో చెరుకు రసాన్ని తాగడం వల్ల వేడిని తట్టకునే శక్తి ఉంటుంది. వేడి వాతావరణంలో చెరకు రసం తాగడం వల్ల ఆరోగ్యానికి ఏం జరుగుతుందో తెలుసుకోండి. వేసవి దాహం తీరాలంటే కేవలం మంచినీళ్లు సరిపోవు. కొన్ని రకాల జ్యూసులు, పానీయాలు తాగాల్సిన అవసరం ఉంది. వేసవిలో కచ్చితంగా తాగాల్సిన పానీయాలలో చెరుకు రసం ఒకటి. ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. వేసవి తాపం నుండి మిమ్మల్ని కాపాడడమే కాదు ఆహ్లాదకరమైన విశ్రాంతిని కూడా ఇస్తుంది. చెరుకు రకసం ఒక మంచి రిఫ్రెష్ డ్రింక్ అని చెప్పుకోవచ్చు. అయితే చక్కెర కలపని చెరుకు రసాన్ని మాత్రమే తాగాలి. చక్కెర కలపడం వల్ల చెరకు రసం అనారోగ్యకరమైనదిగా మారిపోతుంది. చెరుకు రసాన్ని దేశీపానీయంగా చెప్పుకోవాలి. ఈ దేశీ సమ్మర్ డ్రింక్ ను వేసవిలో తాగడం వల్ల ఆరోగ్యానికి ఎలాంటి మేలు జరుగుతుందో వివరిస్తున్నారు పోషకాహార నిపుణులు.



చెరుకు రసంలో మనకు అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు నిండి ఉంటాయి. అలాగే కాల్షియం, పొటాషియం, విటమిన్ సి, విటమిన్ బి వంటివి ఎన్నో ఉంటాయి. అధిక చెమట కారణంగా మనం కోల్పోయిన ఎన్నో పోషకాలను తిరిగి నింపుతుంది. చెరకు రసాన్ని కొద్ది మొత్తంలో తీసుకున్నా చాలు... శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. శక్తి స్థాయిలను పెంచుతుంది. జీర్ణక్రియకు సాయం చేస్తుంది.

వేడి వాతావరణంలో చెరుకు రసాన్ని తాగడం వల్ల చెమట ద్వారా కోల్పోయిన ఎలక్ట్రోలైట్స్ తిరిగి శరీరంలో నింపుకోవచ్చు. శారీరక శ్రమ చేసిన తర్వాత చెరుకు రసాన్ని తాగితే ఎంతో మంచిది. చెరుకు రసంలో సహజంగానే చక్కెర నిండి ఉంటుంది. కాబట్టి తాగిన వెంటనే శక్తిని అందిస్తాయి. కృత్రిమ స్వీట్‌నర్లు ఏమీ ఉండవు. కాబట్టి డయాబెటిస్ లేని వారికి ఈ చెరకు రసం ఆరోగ్యకరమైన పానీయం. దీన్ని అధికంగా తాగితే హఠాత్తుగా రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. కాబట్టి డయాబెటిస్ ఉన్న వారు తక్కువ మొత్తంలోనే తాగాలి.

చెరుకు రసంలో అధిక స్థాయిలో ఫైబర్ ఉంటుంది. శరీరంలోని పోషకాలను శోషించుకునే ఎంజైమ్‌లను చెరుకు రసం శరీరానికి అందిస్తుంది. అధ్యయనాల ప్రకారం చెరుకు రసం కాలేయాన్ని దెబ్బ తినకుండా కాపాడుతుంది. కాలేయ పనితీరును మెరుగుపరుస్తుంది. ఇందులో ఉండే విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. ఇన్ఫెక్షన్లు వంటివి రాకుండా కాపాడుతాయి. చెరుకు రసం తరుచూ తాగేవారిలో జలుబు, ఫ్లూ వంటివి రాకుండా ఉంటాయి. ఇందులో సహజ చక్కెర ఉన్నప్పటికీ, క్యాలరీలు తక్కువగా ఉంటాయి. కొవ్వు కూడా ఉండదు కాబట్టి బరువు పెరిగే అవకాశం తక్కువే. ఇది చర్మ ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది.






# రూట్ మార్చిన ఫహాద్ ఫాసిల్..

తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తోన్న సినిమాల్లో ఒకటి తలైవా 170. జై భీమ్ ఫేం టీజే జ్ఞానవేళ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి వేట్టైయం టైటిల్‌ను ఫైనల్ చేశారని తెలిసిందే. టైటిల్ టీజర్‌ను విడుదల చేయగా నెట్టింట చక్కర్లు కొడుతోంది. బుక్ రీడింగ్ తర్వాత చేతిలో స్టిక్ పట్టుకొని.. స్టైలిష్ గాగుల్స్ పెట్టుకున్న రజినీకాంత్ అభిమానులకు విజువల్ ట్రీట్ అందించడం ఖాయమని ఈ విజువల్స్ చెప్పకనే చెబుతున్నాయి. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుబాస్కరన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో గురు ఫేం రితికా సింగ్ ఈ చిత్రంలో వన్ ఆఫ్ ది ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ కీలక పాత్రలో నటిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ హీరో ఫహాద్ ఫాసిల్ మరో కీ రోల్ పోషిస్తున్నాడు. ఫహాద్ ఫాసిల్ ఈ మూవీలో తన పాత్ర ఎలా ఉండబోతుందో హింట్ ఇచ్చేసి అందరినీ ఖుషీ చేస్తున్నాడు. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో ఫహాద్ ఫాసిల్ మాట్లాడుతూ.. ఈ చిత్రంలో తాను కామెడీ టచ్‌తో సాగే పాత్రలో కనిపించనున్నట్టు చెప్పాడు. ఈ రోల్ ప్రస్తుతం తాను చేస్తున్న పాత్రలకు చాలా దూరంగా ఉంటుందన్నాడు. ఇక సీరియస్ కథాంశాలతో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఫహాద్ ఫాసిల్ నాన్ సీరియస్ రోల్‌లో ఎలా కనిపించబోతున్నాడోనని ఈ వార్త తెలిసిన అభిమానులు, మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రంలో మంజు వారియర్, రానా దగ్గుబాటి, రావు రమేశ్, రోహిణి మొల్లేటి, దుషారా విజయన్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వేట్టైయం ఈ ఏడాది అక్టోబర్‌లో థియేటర్లలో సందడి చేయనుంది.

# అందుకే పెళ్లి విషయం చెప్పలేదు

అగ్ర కథానాయిక తాప్సీ ఇటీవలే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. చిరకాల స్నేహితుడు, డెన్మార్క్ బ్యాడ్మింటన్ ప్లేయర్ మాథియస్ బోతో ఈ భామ మార్చి 23న పెళ్లిపీటలెక్కింది. కొద్దిమంది సన్నిహితుల సమక్షంలో అత్యంత గోప్యంగా ఈ వివాహం జరిగింది. పెళ్లి తాలూకు ఫొటోలు కూడా బయటకు రాలేదు. ఇండస్ట్రీకి చెందిన తాప్సీ సన్నిహిత మిత్రులు తమ సోషల్‌మీడియా ఖాతాల్లో పోస్ట్ చేసిన ఫొటోల ద్వారా పెళ్లి విషయం బయటకు వచ్చింది. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన వివాహం గురించి స్పందించింది తాప్సీ. పెళ్లి గురించి అందరూ చర్చించుకోవడం తనకు ఇష్టం లేదని, అందుకే అనవసర ఆర్భాటాలకు దూరంగా నిరాడంబరంగా పెళ్లి చేసుకున్నానని తెలిపింది. ఆమె మాట్లాడుతూ 'నా కుటుంబం, సన్నిహితుల అంగీకారంతోనే పెళ్లి చేసుకున్నా. నా పెళ్లి గురించి ప్రపంచం మొత్తానికి తెలియాల్సిన అవసరం లేదనిపించింది. అంత మాత్రాన ఎప్పటికీ రహస్యంగా ఉంచాలనుకోవడం లేదు. ప్రస్తుతానికైతే నా పెళ్లి ఫొటోలను షేర్ చేసే ఆలోచన లేదు. భవిష్యత్తులో నా అభిప్రాయం మారితే అప్పుడు ఫొటోలను పంచుకుంటాను' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ భామ హిందీలో 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబా' చిత్రంలో నటిస్తున్నది.





# శిఖర్ తనకు ముందు నుంచి ఫ్రెండ్

బాలీవుడ్ నటి జాన్వీ కపూర్.. ముంబైలో జరిగిన మైదాన్ ఫిల్మ్ స్క్రీనింగ్‌కు హాజరైంది. ఆ చిత్రాన్ని జాన్వీ తండ్రి బోనీ కపూర్ ప్రొడ్యూస్ చేశారు. ఆ స్క్రీనింగ్ ఈవెంట్‌కు వైట్ పాంట్‌సూట్‌లో వచ్చిన జాన్వీ చాలా స్పెషల్‌గా కనిపించింది. ధగధగలాడే నక్లెస్‌ను ఆమె ధరించింది. అయితే ఆ హారంపై భాయ్‌ఫ్రెండ్ షీకూ పేరు రాసి ఉన్నట్లు గుర్తించారు. జాన్వీ భాయ్‌ఫ్రెండ్ శిఖర్ పహరియా ముద్దు పేరు షీకూ. ఇటీవల కరణ్ జోహార్‌తో జరిగిన కాఫీ విత్ కరణ్ 8 షోలో షీకూ గురించి జాన్వీ చెప్పింది. స్పీడ్ డయల్ లిస్టులో ఉన్న ముగ్గురు పేర్లు చెప్పాలని కోరగా, షీకూ పేరును జాన్వీ చెప్పింది. శిఖర్ పహరియాతో ఉన్న రిలేషన్ గురించి కరణ్ జోహార్ తన ఛాట్ షోలో అడిగాడు. మీ ప్రేమ వ్యవహారం చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉందని, తొలుత శిఖర్‌తో డేటింగ్ చేశారని, ఆ తర్వాత మరొకరితో డేటింగ్ చేశారని, మళ్లీ ఇప్పుడు శిఖర్‌తో డేటింగ్ చేస్తున్నారని, ఇది నిజమా లేక అబద్ధమా అని జాన్వీని కరణ్ అడిగాడు.. దాని జాన్వీ బదులిస్తూ.. నాదాన్ పరిందే ఘర్ ఆజా సాంగ్‌ను తన కోసం షీకూ పాడి వినిపించేవాడని ఆమె అన్నారు. శిఖర్ తనకు ముందు నుంచి ఫ్రెండ్‌గా ఉన్నాడని, తన నుంచి అతను ఏదో ఆశిస్తున్నాడని అనుకోవడం లేదని, ఎటువంటి స్వార్థం లేకుండా అతను తనతో ఉన్నట్లు జాన్వీ చెప్పింది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com